క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎండీఎం జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పాయకరావుపేట : పెంటకోట గ్రామంలో గల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎం.డి.ఎం. జిల్లా కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెల్సుకున్నారు. ప్రభుత్వం నిర్ధారించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పెంటకోట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పై నిర్వాహకులను ఆరా తీశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. పిల్లల హాజరు పుస్తకం పరిశీలించారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు అందిస్తున్న పోషకాహారాన్ని రుచి చూశారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఉప సర్పంచ్ బొమిరెడ్డి పల్లి సాయి వజ్రం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ వీరునాయుడు, ఎంపీడీవో మన్మథరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సందడిగా ఆటల పోటీలు



స్టేషన్ రోడ్డు పాఠశాలలో ఆటల పోటీల్లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

యలమంచిలి : ఆగస్టు 15 సందర్భంగా మండలంలోని పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఆటల పోటీలలో బాల బాలికలు ఉత్సాహంగా ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ వంటి క్రీడల్లో పాల్గొన్నారు రైల్వే స్టేషన్ పక్కనే గల స్థలంలో రెండు రోజులుగా వ్యాయామ ఉపాధ్యాయుడు మూర్తి ఆధ్వర్యంలో ఆటలు పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



మెలిపాకలో సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పారావు

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెలిపాక సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు కోరారు. మెలిపాకలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఆయన అందజేశారు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు, సచివాలయ కన్వీనర్ చేకూరి రామరాజు, ఎంపీడీవో మన్మథరావు, కాసురాజు, కర్రి సింగమనాయుడు, ఏసు, మాధవరావు, రామునాయుడు, రామగణేష్, అంగన్‌వాడీ టీచర్లు కోమలి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వార్డు పదవులకు ఆరు నామినేషన్లు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు పంచాయతీలో 1వ వార్డుకు నిర్వహిస్తున్న ఎన్నికలకు గాను గురువారం 5 నామినేషన్లు దాఖలైనట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే రేబాక 3వ వార్డుకు సంబంధించి గురువారం మరో నామినేషన్ దాఖలైందన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



కె.వెంకటాపురంలో విద్యార్థితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న వైద్యులు



పాటిపల్లి కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వరహాల దొర



మునగపాక హైస్కూల్లో నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు



సర్వసిద్ధి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి శక్తిప్రియ

మునగపాక : పాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం ద్వారా కడుపులో పురుగులు చనిపోతాయన్నారు. తద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు, సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది అప్పారావు,ఏఎన్ఎం సుజాత, హెచ్ఏ జ్యోతీలాల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, ఎంఈవో వేణుగోపాలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ గణేష్, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఏఎన్ఎం రేవతి, ఆశాలు పాల్గొన్నారు.

విజయవంతంగా డీవార్మింగ్ డే

కోటవురట్ల : నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతమైనట్టు వైద్యులు ఎస్.సంతోష్‌కుమార్, సుదీప్ తెలిపారు. మండలంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 9 ఏళ్ల లోపు చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యులు మాట్లాడుతూ కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో 5,399 మంది చిన్నారులు లక్ష్యం కాగా 5068 మంది చిన్నారులతో మాత్రలు మింగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : విద్యార్థులు చిన్నారులు విధిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని పలుగ్రామాల్లో వైద్య సిబ్బంది పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సర్వసిద్ధి అంగన్‌వాడీ, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి మాత్రలు వేశారు. పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి రాజేశ్వరి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తుందని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అనేక చర్యలు తీసుకొంటుందని జెడ్పీ కోఆప్షన్ మెంబర్ నర్మాల కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం కస్తూర్బా విద్యా కేంద్రంలో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలను వేశారు. 230 మందికి ఈ నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరిగింది. ఎంపీపీ కోన లచ్చన్నాయుడు, విమలనాయుడు, వైద్యాధికారి అలేఖ్య, కేజీబీవీ ఉపాధ్యాయిని సునీత, సామాజిక ఆరోగ్య అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

యలమంచిలి : గ్రామంలో అందరూ నులిపురుగుల నిర్మూలనకు కృషి చేద్దామని రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి అన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల మాత్రలు ఆమె విద్యార్థులకు అందజేశారు.

నక్కపల్లి: మండలంలో గురువారం డీ వార్మింగ్ డే ని పురస్కరించుకొని 15172 మందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు గొడిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి తెలిపారు. గొడిచెర్ల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.



ఆల్బెండజోల్ -400 ఎంజీ మాత్రలను విద్యార్థుల నోటిలో వేస్తున్న దృశ్యం



రేగుపాలెంలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజాన మహాలక్ష్మి



విద్యార్థినితో నులిపురుగు మాత్ర మిగిస్తున్న మురళీకృష్ణారెడ్డి

ఘనంగా ఎమ్మెల్యే బాబూరావు జన్మదిన వేడుకలు

పాయకరావుపేట : నియోజకవర్గంలో ప్రజలకు అందరికీ అందుబాటులో వుండే వ్యక్తి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అని, పార్టీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జన్మదినం సందర్భంగా పట్టణంలో గల పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయంలో జన్మదిన కేక్‌ను బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు కట్ చేశారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాబూరావు పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచారన్నారు. అనంతరం గొల్ల బాబూరావు జన్మదిన కేక్‌ను కట్ చేసి, అందరికీ పంచారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఐసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, గోపాలపట్నం, మంగవరం, మాసాహేబుపేట, పాల్మన్‌పేట, పీఎల్.పురం, రాజగోపాలపురం సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, వంగలపూడి రామారావు, గెడ్డమూరి శ్రీను, కోటేశ్వరరావు, పడాల దివాణం, లోవరెడ్డి, ఎంపీటీసీలు సతీష్‌రాజు, మహేష్ రెడ్డి, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు లోవకుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నానాజీ, యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు పాల్గొన్నారు.



గొల్ల బాబూరావు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు




ఎమ్మెల్యే బాబూరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బొడ్డేడ ప్రసాదరావు తదితరులు

ఎమ్మెల్యేకు నాయకుల శుభాకాంక్షలు

ఎస్.రాయవరం : మండలంలో కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల నంంచి వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎస్.రాయవరం, నక్కపల్లి మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, శీరం నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, మైలారు శ్రీనివాసరావు, ఎస్.రాయవరం, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మైలపల్లి శ్రీనివాసరావు, పాలపర్తి పాపారావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు తరలిన నాయకులు

నక్కపల్లి : పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు గురువారం నక్కపల్లి మండలం నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ మోటారు సైకిల్ ర్యాలీగా తరలివెళ్లారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేష్, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరిబాబు, సీనియర్ నాయకులు గోవిందు, బాబ్జి, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, సర్పంచ్‌లు కర్రి శ్రీను, వియ్యపుశ్రీను, రెడ్డి వరహాలు, ఎంపీటీసీలు చంద్రరావు, బచ్చలరాజు, కాసుబాబు, రామకృష్ణ, కరణం ఈశ్వరరావు, బాబూరావు తదితరులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



నక్కపల్లి నుంచి ర్యాలీగా వెళ్తున్న నాయకులు

సర్పంచ్ ఉప ఎన్నికకు 5 నామినేషన్లు



సర్పంచ్ ఎన్నికకు హేమ పోలవరపు నామినేషన్ వేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండలంలో కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నికకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐదు నామినేషన్లు ధాఖలు అయ్యినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటనారాయణ రావు తెలిపారు. ఇందులో వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారులతో వారి వారి అభ్యర్థులతో నామినేషన్ వేయించారు. మొదటిగా హేమ పోలవరపు , అచ్చియ్యమ్మ ఇళ్ల, రంగమ్మ అంగా, రత్నం పోలవరపు, కర్రి సూరివేణి నామినేషన్లు వేసినట్టు చెప్పారు. వార్డు మెంబర్లకు చినగుమ్ములూరు ఒకటి, గుడివాడ ఒకటి, లింగరాజుపాలెం రెండు చొప్పున నామినేషన్లు వేశారని చెప్పారు. నామినేషన్లు వేసే ప్రక్రియ గురువారంతో ముగిసిందని విత్‌డ్రాలు 13 తేదీలోపు చేయాల్సి ఉండగా ఎన్నిక 19 తేదీన నిర్వహించి , అదే రోజు ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలి

మునగపాక : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో గురువారం రాజుపేట, కాకరాపల్లికి చెందిన పార్టీ శ్రేణులు ప్రసాద్‌కు పుష్పగుచ్చాలు అందజేసి మెమొంటోతో బహూకరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో పార్టీ జెండా రెపరెపలాడాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పార్టీ శ్రేణులు

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

యలమంచిలి : వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు.తెరువుపల్లి గ్రామంలో గురువారం తడి చెత్త,పొడి చెత్త,ప్రమాదకర చెత్తను ఏవిధంగా వేరు చేసి చెత్తబుట్టల ద్వారా పారిశుధ్య కార్మికులకు అందజేయాలో వార్డుల్లో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తను రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ వేస్తే జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మరమ్మతుల కోసం రైల్వే గేట్ మూసివేత

యలమంచిలి : పట్టణంలో పెదపల్లి రైల్వే గేట్‌ను మరమ్మతుల కారణంగా మూసివేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి నుంచి పెదపల్లి వెళ్లే రహదారిలో ఉన్న లెవెల్ క్రాసింగ్ నెంబరు 475 గేట్ అత్యవసర మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గమైన యర్రవరం ఆర్ అండ్ బి ద్వారా ప్రయాణించాలని తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నేడు

మునగపాక : తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరుగుతుందని తోసా (తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు ఉన్నత రంగాల్లో రాణించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే 2022-23లో పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటప్పారావు కోరుతున్నారు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

యలమంచిలి : రైతు భరోసా నగదు జమ కాని రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. గురువారం యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో రైతు భరోసా నగదు జమ కాని రైతులకు ఈ కేవైసీ నమోదు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. పంటలు సాగు చేస్తున్న రైతులు అర్హులైన వారికి వారి అకౌంట్‌లో నగదు జమ కాకపోతే తమ సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులను సంప్రదించి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు.మండలంలో 1440 మంది రైతులకు ఈకేవైసీ నమోదు చేయించుకోకపోవడం వల్ల ఖాతాల్లో నగదు జమ కాలేదన్నారు.

మాతృభూమి రుణం తీర్చలేనిది



పోతిరెడ్డిపాలెంలో నాభూమి-నా దేశం కార్యక్రమంలో ప్రమాణం చేస్తున్న ఎంపీపీ గోవింద్



మూలపేటలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ గంగప్పలనాయుడు, చెల్లయ్యనాయుడు

- గ్రామాల్లో నా భూమి–నాదేశం కార్యక్రమం
- స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నివాళి

యలమంచిలి : గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమం మరొకసారి వీరులను గుర్తుకు తెచ్చేలా ఉందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. గురువారం రేగుపాలెం, పేట బయ్యవరం పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో నా భూమి –నా దేశం కార్యక్రమంలో భాగంగా సచివాలయాలు వద్ద గోడలపై స్వాతంత్య్ర సమయోధుల పేర్లు రాయడం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పేట బయ్యవరంలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఎంపీడీవో అప్పలనాయుడు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, పేట బయ్యవరం సర్పంచ్ మొగలిపల్లి సత్యనారాయణ శివ, సీతారాం పాల్గొన్నారు.

మునగపాక : దేశ స్వాతంత్య్రం కోసం ఎంతో కృషి చేసిన అమరవీరులను స్మరించుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు కోరారు. నేలతల్లికి నమస్కారం–అమరవీరులకు వందనం పేరిట గ్రామాల్లో శిలాఫలకాల ఏర్పాటుతో పాటు మొక్కలు నాటారు. మూలపేటలో నిర్వహించిన అమరవీరులకు వందనం కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు, ఉప సర్పంచ్ దేవీచంద్ర, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెల్లయ్యనాయుడు పాల్గొన్నారు.



బి.కె.పల్లిలో శిలాఫలకం వద్ద మహనీయులకు నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

కోటవురట్ల: బి.కె.పల్లి, యండపల్లి, అన్నవరం, జల్లూరు, సుంకపూరు, లింగాపురం, తంగేడు గ్రామాలలో నాభూమి–నాదేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధులు, మహనీయుల చిత్రపటాల వద్ద ఘన నివాళి అర్పించి మొక్కలు నాటారు.

ప్రజా సమాచార అధికారుల నియామకం సాహసోపేతం



బొడ్డేడ జగ్గప్పారావు

మునగపాక : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో ప్రజా సమాచార అధికారుల నియామకం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర సమాచార హక్కు, వినియోగదారుల హక్కు చట్టం క్రియాశీలక కార్యకర్త బొడ్డేడ జగ్గప్పారావు పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతూ పంచాయతీల చుట్టూ తిరుగుతున్నా కొన్ని సందర్భాల్లో పనులు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందన్నారు. కొంతకాలంగా నిర్లిప్తతతో ఉంటున్న ప్రజలకు సచివాలయాల పరిధిలో సమాచార అధికారులను నియమించడం అభినందనీయమన్నారు. సమాచార దరఖాస్తును నింపడం రాని వారికి అధికారులు సహకరించాలన్నారు. కాగా సమాచార అధికారిగా పంచాయతీ కార్యదర్శి, సహాయాధికారిగా డిజిటల్ అసిస్టెంట్, మొదటి అప్పిలేట్ అధికారిగా ఎంపీడీవో వ్యవహరిస్తారన్నారు. మంచి సంప్రదాయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని జగ్గప్పారావు కోరారు.

గిరిజనులకు సంఘీభావం తెలిపిన జెడ్పీటీసీ

కోటవురట్ల: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి కోరారు. అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్షకు జెడ్పీటీసీ ఉమాదేవి సంఘీభావం తెలిపారు. గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆమె గిరిజనులతో పాటు కూర్చుని వారికి ధైర్యాన్ని కల్పించారు. ఆమె మాట్లాడుతూ అణుకు గిరిజన గ్రామానికి సంబంధించి రహదారి నిర్మాణం, పాఠశాల ఏర్పాటు చాలా అవసరమన్నారు. ఈ నెల 19న జరిగే జెడ్పీ స్థాయి సంఘ సమావేశంలో గిరిజనుల సమస్యను ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సత్యనారాయణ, ఆంజనేయులు, నానాజీ, సీపీఎం నాయకుడు డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.



గిరిజనులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న జెడ్పీటీసీ ఉమాదేవి

సమగ్ర భూ సర్వే ద్వారా సమస్యల పరిష్కారం

అచ్యుతాపురం(అనకాపల్లి): సమగ్ర భూసర్వే ద్వారా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు అన్నారు.అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం సచివాలయం పరిధిలో నిర్వహించిన సమగ్ర సర్వే పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సచివాలయం, పంచాయితీల్లో భూముల హక్కులకు సంబంధించిన జాబితా అందుబాటులో ఉందని, ఎవరికైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్‌బాబు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, డీటీ సురేష్, వీఆర్‌వో జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పవరం గ్రామ సభలో మాట్లాడుతున్న పిన్నమరాజు వాసు

వార్డు సభ్యుని ఎన్నికకు ఐదు నామినేషన్లు

మునగపాక : మెలిపాక పంచాయతీ వార్డు సభ్యుని ఎన్నికకు గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు నుంచి గుల్ల అమర వెంకట సత్యనారాయణ, పట్టా సూర్యనారాయణ, టీడీపీ నుంచి బొల్లం లోవరాజు, నందికోళ్ల సాయిరాం, జనసేన నుంచి రాములు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారి బీవీఎస్ రాజుకు నామినేషన్లు అందజేశారు. ఈ నెల 19న వార్డు సభ్యుని పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతు వార్డు అభ్యర్థి సత్యనారాయణ

మునగపాకలో భారీ వర్షం

మునగపాక : మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముప్పావుగంట పాటు వర్షం కురవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. మునగపాక మండల సముదాయాలకు వెళ్లే మార్గంలో నీరు నిలిచిపోయింది. మూడు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండడంతో అవస్థలు పడ్డ ప్రజలు ఈ వర్షానికి ఉపశమనం పొందారు. వరిసాగుకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.



మునగపాకలో రోడ్డుపై చేరిన వర్షపునీరు